ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.6 ; కనిష్ఠం 10.9
నిర్మల్
జిల్లా వార్తలు
8
గురువారం 11 డిసెంబరు 2025





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావులేదు

- పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు
- జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేడు జిల్లాలో జరుగనున్న మొదటి విడత పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రత చర్యలను పకడ్బందీగా చేపట్టామని జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మామడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన బందోబస్తు స్కీమ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక దిశానిర్దేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామంలో శాంతి భద్రతలు క్షుణ్ణంగా పర్యవేక్షించేలా బలగాల నియోజవర్గాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కేంద్రాల వద్ద క్రిటికల్, సాధారణ, అత్యంత సున్నిత ప్రాంతాలు గుర్తించి, అదనపు బలగాలను మోహరించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావు ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ ప్రతులు, ఫారాలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ



ఎన్నికల సామాగ్రిని సర్దుకుంటున్న ఎన్నికల అధికారులు

నేడే తొలి సంగ్రామం

- పూర్తయిన ఏర్పాట్లు
- ఓటు వేయనున్న 1,27,245మంది ఓటర్లు
- 136 గ్రామ పంచాయతీల్లో పోలింగ్

నిర్మల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో తొలి దశ కింద గ్రామ పంచాయతీ ఎన్నికలు గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో మూడు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తొలి దశ కింద దస్తూరాబాద్, పెంబి, కడెం, ఖానాపూర్, మామడ, లక్ష్మణచాంద మండలాల్లో పోలింగ్ జరగనుంది. 136 గ్రామ పంచాయతీలకు గానూ 1,27,245 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. ఇందులో నుంచి 60,576 మంది పురుషులు కాగా 66,667 మంది మహిళ ఓటర్లున్నారు. 136 గ్రామ పంచాయతీల కోసం గానూ 1072 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసులు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. జిల్లా అంతటా 30 పోలీసు యాక్ట్ అమలవుతోంది. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆరు మండలాల్లో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల వద్దకు పోలింగ్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో చేర్చారు. పెంబి, కడెం మండలాల్లోని మారుమూల గ్రామాలకు వెళ్ళేందుకు వాగులు అడ్డున్న కారణంగా ఎన్నికల సిబ్బందిని పడవల్లో ఆ వాగులను దాటించి పోలింగ్ కేంద్రాలకు చేర్చారు.

భారీగా ప్రలోభాలు షురూ..

తొలి దశ ఎన్నికల్లో సర్పంచ్ పదవులకు పోటీ చేసే అభ్యర్థులు ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రలోభాలు మొదలు పెట్టారంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఓటుకు రూ. 1000, మరికొన్ని గ్రామాల్లో రూ. 500 చొప్పున పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి.

136 గ్రామ పంచాయతీల్లో..

మొత్తం 136 గ్రామ పంచాయతీలో 1072 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఉదయం 7గంటల నుంచి 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలుకాబోతోంది. ఇప్పటికే గ్రామాల్లో బహిరంగ ప్రచారం ముగిసిపోయిన కారణంగా బుధవారం పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇంటింటా ప్రచారానికి పరిమితమయ్యారు.

భారీగా ఏర్పాట్లు

మొదటి దశ కింద ఆరు మండలాల్లో జరగబోతున్న ఎన్నికల కోసం అధికారులు ఇప్పటికే పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఎన్నికల రోజూ ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిలలు సంయుక్తంగా ఎన్నికల ఏర్పాట్లపై చర్యలు తీసుకుంటున్నారు. వారు స్వయంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ నిర్వహణ తీరును అలాగే పోలింగ్ సరళితో పాటు సౌకర్యాల విషయంలోనూ పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విషయంలోనూ పరిశీలించనున్నారు. దీని కోసం గానూ కలెక్టర్, ఎస్పీలు వేరు వేరుగా రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేసుకొని పర్యటించనున్నారు.

మొదటి దశ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఖానాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం ఖానాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అందరూ ప్రశాంతంగా ఉండి, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ఓపికగా ఉండాలన్నారు. అన్ని ఫారములను తప్పులు లేకుండా పూరిస్తూ, ఓటింగ్ సరళి వివరాలను పంపాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియలు పారదర్శకంగా చేపట్టాలన్నారు. కౌంటర్ల వారీగా తిరుగుతూ అన్ని పోలింగ్ ప్రతులు, ఫారములు, ఇతర ఎన్నికల సామాగ్రి, ఆయా రూట్లు, పోలింగ్ కేంద్రాల వారీగా అందయో లేదో ఎన్నికల విధులు నిర్వహించబోయే అధికారులను అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు సమయానికి భోజనం అందించాలన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ... మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలను తీసుకున్నామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి (సీపీవో) జీవరత్నం, డీఈవో భోజన్న, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు



ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

తెప్పపై తరలివెళ్లిన ఎన్నికల సిబ్బంది

- యాపల్‌గూడ గ్రామ పంచాయతీని పరిశీలించిన నిర్మల్ జిల్లా అబ్జర్వర్ ఆయేషా మస్రత్ ఖానం



తెప్పపై ప్రయాణం చేస్తున్న ఎన్నికల సిబ్బంది

పెంబి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి దశ పోలింగ్ సందర్భంగా బుధవారం పోలింగ్ సిబ్బంది మండలంలోని యాపల్‌గూడ పోలింగ్ బూత్‌కి చేరుకునే మార్గంలో కడెం వాగు ఉండడంతో స్థానికంగా తయారు చేసిన పడవను ఉపయోగించి సిబ్బందిని తరలించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా జనరల్ అబ్జర్వర్ ఆయేషా మస్రత్ ఖానం పోలింగ్ సిబ్బంది నదిని దాటి పోలింగ్‌కు చేరుకునే ప్రాంతాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. సిబ్బంది ప్రయాణం ఎటువంటి ప్రమాదం లేకుండా జరుగాలన్న దిశగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేడు మొదటి విడత పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో సిబ్బందికి రవాణా, భద్రత, కమ్యూనికేషన్ వంటి అన్ని ఏర్పాట్లు ఖచ్చితంగా సిద్ధంగా ఉండాలని ఆమె స్థానిక ఎన్నికల నిర్వాహకులకు ఆదేశించారు. నదిని దాటే ప్రాంతంలో తగినంత సిబ్బంది, లైఫ్ జాకెట్లు, సపోర్ట్ రోప్స్ వంటి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఎటువంటి ఇబ్బంది లేకుండా బూత్‌లకు చేరుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని అబ్జర్వర్ స్పష్టం చేశారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక

భైంసా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అంగవైకల్యం ఉందని ఆందోళన చెందకుండా ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లోనూ రాణించేందుకు ముందుకు సాగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక పిలుపునిచ్చారు. బుధవారం భైంసాలో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకొని ప్రగతి బాటలో పయనించాలన్నారు. స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. భైంసా ఐసీడీఎస్ సీడీపీవో రాజశ్రీ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.దామోదర్ రెడ్డి, ఆరోగ్యభారతి జిల్లా సంయోజక్ డా.ఎం.రామకృష్ణగౌడ్‌లు మాట్లాడుతూ సకలంగులకు దీటుగా దివ్యాంగులు ప్రతీ రంగంలోనూ రాణించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని అకాంక్షించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని దివ్యాంగుల చేపట్టిన యోగా, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా అలరించాయి. ఇందులో భాగంగా దివ్యాంగులకు విశిష్ట సేవలు అందిస్తున్న పలు సంస్థలు , సంఘాలు, వ్యక్తులకు కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందచేశారు. దివ్యాంగులకు నిర్వహించిన ఆటలపోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ప్రముఖ యువ వ్యాపార వేత్త శివ బచ్చువార్, ఐఎంఏ కార్యదర్శి డా. సూర్యకాంత్ రెడ్డి, వ్యాపారి జి.రాజేందర్‌లు దాతలుగా సహాయ, సహకారాలు అందించారు. ఇందులో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ అధ్యక్షుడు డా.మహిపాల్, కార్యదర్శి సిద్దయ్య, పారిశ్రామిక వేత్త నాగ్‌నాథ్ పాటిల్, దివ్యాంగుల అసోసియేషన్ ప్రతినిదులు మహేష్ పాల్గొన్నారు.

ఎముకలు కొరికే చలిలో తప్పని ఎన్నికల విధులు

- చలి తీవ్రత నేపథ్యంలో మహిళా సిబ్బందికి ప్రత్యేక ఏర్పాట్లు
- ఆరు మండలాల్లో 136 గ్రామ పంచాయతీలకు నేడు పోలింగ్



తర్లపాడ్‌లో చలి మంటలు కాచుకుంటున్న ఎన్నికల సిబ్బంది

ఖానాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొదటి విడతలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. నేడు ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రానికి ఆరు మండలాల్లోని 136 గ్రామ పంచాయతీలలో నిర్వహించనున్న ఎన్నికల కోసం పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ రెండు, మూడు రోజులుగా జిల్లాలో చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో బుధవారం రాత్రి ఎముకలు కొరికే చలిలో సైతం సిబ్బంది ఎన్నికల విధులను నిర్వహించారు. కాగా చలి తీవ్రత నేపథ్యంలో ఎన్నికల విధుల నిర్వహణ కోసం వచ్చిన మహిళా సిబ్బందికి ఇబ్బంది కలుగకుండా ఆయా గ్రామాల్లో పాఠశాలలో కాకుండా ప్రైవేట్ గదులను సైతం ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల కోసం వచ్చిన పురుష సిబ్బందికి మాత్రం పోలింగ్ కేంద్రాల్లోనే బస చేసేలా ఏర్పాటు చేశారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఇంటి నుంచి వెచ్చని దస్తులను తెచ్చుకున్నట్లు ఎన్నికల సిబ్బంది తెలిపారు. చలి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఆవరణలో చలి మంటలు వేసుకొని సిబ్బంది ఉపశమనం పొందారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి ఎన్నికల విధులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సిబ్బందికి స్నానం కోసం వేడి నీళ్ల సౌకర్యాన్ని కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు.

పంచాయతీ ఎన్నికల అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం



మాట్లాడుతున్న పరిశీలకుడు మనోహర్ రాజ్

ముథోల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల కోసం మండల కేంద్రమైన ముథోల్ లోని డీలక్స్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జిల్లా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ మనోహర్ రాజ్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల వ్యయ నియంత్రణ, ఖర్చుల పారదర్శకత, ఖర్చుల రికార్డుల నిర్వహణ వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో మార్గదర్శకాలను అందించారు. అభ్యర్థులు ప్రచారం కోసం చేసే ప్రతీ ఖర్చును తప్పనిసరిగా నమోదు చేయాలని, నిర్ణీత పరిమితికి మించి వ్యయాలు చేయరాదని అబ్జర్వర్ హెచ్చరించారు. ప్రచార సామగ్రి ముద్రణ, వాహనాల వినియోగం, మైక్ సెట్టింగులు, వేదికల ఏర్పాటు, కార్యాలయ నిర్వహణ వంటి ప్రతి రూపాయి ఖర్చు కూడా రశీదులతో సహా నమోదు చేయాలని సూచించారు. రోజురోజు ఖర్చుల వివరాలను సంబంధిత అధికారులకు బరిలో ఉన్న అభ్యర్థులు అందజేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎక్స్పెండిచర్ మానిటరింగ్ టీమ్‌లు నిరంతరం పర్య వేక్షణలో ఉంటాయని తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, స్వచ్ఛంగా పూర్తవ్వాలంటే అందరూ చట్టాలు, నియమావళి పాటించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవకుమార్, అసిస్టెంట్ వ్యయ అధికారులు వినోద్ కుమార్, ఎండీ జాచియోద్దీన్, అభ్యర్థులు, అధికారుల బృందం, తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థినులు

నమూనా ఎన్నికలు

కుంటాల, డిసెంబరు, 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కుంటాల స్థానిక విజయ సాయి పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు నమునా ఎన్నికలు నిర్వహించారు. స్థానిక పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు ఎన్నికలలో నామినేషన్‌లు మొద లుకొని ఉప సంహరణ, అభ్యర్థుల జాబితా ప్రకటనతో పాటు ఎన్నికల్లో ఓటు వేసే విధానం, విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకునే విధానం, ఓట్ల లెక్కింపు గెలుపొందిన అభ్యర్థుల ప్రకటించే విధానం తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయానికి విరాళం

- ఖానాపూర్‌లో ఎన్నారై దంపతుల ఉదారత



విరాళం అందజేసిన ఎన్నారై దంపతులను అభినందిస్తున్న ఆలయ కమిటీ

ఖానాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్‌లో ఎన్నారై దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. బుధవారం పట్టణంలోని వీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయానికి ఖానాపూర్‌కు చెందిన ఎన్నారై దంపతులు ముజిగి వరప్రసాద్ - వినీతలు రూ. 1,11,000 విరాళం అందించారు. ఆలయ అభివృద్ధి కోసం విరాళం అందజేసిన ఎన్నారై దంపతులను బుధవారం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొక్కుల ప్రదీప్, ఆలయ కమిటీ బృందం అంకం రాజేందర్, కరిపే శ్రీనివాస్, కొత్తపెల్లి సురేష్, శేఖరయ్య, రాజ గంగన్న, తోట సుమిత్, నిమ్మల శ్రీనివాస్, నంద రాకేష్, కౌట మహేష్, పరంకుశం శ్రీనివాస్, విలాస్, తదితరులున్నారు.

ఎన్నికల విధులను ఉత్సాహంగా నిర్వర్తించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

పెంబి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే అధికారులు ఎటువంటి ఒత్తిడి లేకుండా, ఉత్సాహంగా తమ విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం పెంబి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కౌంటర్ల వారీగా సిబ్బందిని, వారికి కేటాయించిన సామగ్రి తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మొదటి దశ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని వివరించారు. త్వరగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నేడు ఉదయం సమయానికి పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని తెలిపారు. ఎన్నికల అనంతరం వారికి అందించిన సామగ్రి అంతటిని తిరిగి అధికారులకు అప్పజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఏఎస్పీలు రాజేష్ మీనా, ఉపేందర్ రెడ్డి, ఆర్డీవో రత్న కళ్యాణి, మండల ప్రత్యేక అధికారి నరసింహ రెడ్డి, డీఈవో భోజన్న, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్





పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



కుంటాలకు వచ్చిన పోస్టల్ బాక్సులు

కుంటాలకు చేరుకున్న పోస్టల్ బాక్సులు

కుంటాల, డిసెంబరు, 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల్లో భాగంగా ఈ నెల 14న నిర్వహించే ఎన్నికలను పురస్కరించుకొని బుధవారం రోజు మండల కేంద్రం కుంటాలకు పోస్టల్ బాక్సులు వచ్చాయి. కుంటాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు గాను నిర్వహించే సర్పంచ్, 134 వార్డు సభ్యుల ఎన్నికల కోసం మొత్తం 153 పోస్టల్ బాక్సులు వచ్చినట్లు ఎంపీడీవో వనజ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు గోడం కార్తీక్ ఎంపిక

బజార్‌హత్నూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతర్ల లోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారుడు గోడం కార్తీక్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల పెద్దపల్లి జిల్లా నంది మేడారంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్తీక్ రాష్ట్ర జట్టులో చోటు సాధించినట్లు హెచ్‌ఎం కిషన్ రెడ్డి తెలిపారు. కాగా హిమాచల్ ప్రదేశ్‌లో వచ్చే జనవరి 5 నుంచి 9 వరకు జరిగే జాతీయ స్థాయి 14 ఏళ్ల బాలుర విభాగంలో ఎస్ జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు ద్వారా పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి బుధవారం జాతర్లలోని క్రీడా పాఠశాలను సందర్శించి విద్యార్థులు చదువుతో పాటు క్రీడా స్ఫూర్తిని మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ వెల్ఫేర్ అధికారి మాడావి కృష్ణారావు, కోచ్ కార్తీక్‌లతో కలిసి క్రీడాకారుడు గోడం కార్తీక్, తండ్రి ఆనంద్ రావులను ఘనంగా సన్మానించారు.

బాబోయ్ పులులు..

● పశువులపై దాడితో రైతుల బెంబేలు

బోథ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బోథ్ రేంజి పరిధిలోని అడవుల్లో చిరుతతో పాటు పులిదాడి చేయడంతో రెండు రోజుల వ్యవధిలో ఒక ఎద్దు, ఆవు మృత్యువాత పడింది. ఆయా గ్రామాల ప్రజల ద్వారా తెలిసిన ప్రకారం.. ఆదివారం రాత్రి పులిదాడి చేయడంతో సోనాల గ్రామానికి చెందిన ఓ రైతు ఎద్దు మృత్యువాత పడింది. అదేవిధంగా సోమవారం రాత్రి కంటేగాం గ్రామానికి చెందిన గణపతి అనే రైతుకు చెందిన ఆవుపై చిరుతపులి దాడి చేయడంతో మృతి చెందినట్లు సమాచారం. రెండు రోజుల వ్యవధిలో ఓ వైపు పెద్దపులి.. మరోవైపు చిరుత చేయడంతో రైతులు బెంబెలెత్తుతున్నారు.

శ్రీనివాస్ సేవలు మరువలేనివి

● సహకార సంఘం ఉపాధ్యక్షుడు నల్ల పద్మాకర్ రెడ్డి

తలమడుగు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గత 30 సంవత్సరాలుగా రైతుల కోసం తలమడుగు సహకార సంఘం సీఈవో మోతే శ్రీనివాస్ చేసిన సేవలు మరువలేవని సహకార సంఘం ఉపాధ్యక్షుడు నల్ల పద్మాకర్ రెడ్డి అన్నారు బుధవారం సహకార సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తలమడుగు సాగర సాగర కార్యాలయంలో గత 30 సంవత్సరాలుగా శ్రీనివాస్ రైతులకు ఎంతో సేవలు చేశారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బదులుపై వెళ్తున్న ఆయనను పాలకవర్గం సభ్యులు సిబ్బంది జరి సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ రాజు, రైతులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు గత 30 సంవత్సరాలుగా ఎలాంటి మచ్చ లేకుండా నిరంతరం రైతుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. సకాలంలో రైతులకు రుణాలు అందించడం ఎరువుల కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం, అంతేకాకుండా రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు సీఈఓ ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఇందులో ఉపాధ్యక్షులు పద్మాకర్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి మణిరం ప్రతాప్ జరి సొసైటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, రుయాడి రైతులు ప్రకాష్ రెడ్డి, గంగాధర్, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, సాంబశివ, ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సీఈవో శ్రీనివాసులు సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

నేరడిగొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ మైదానంలో బుధవారం బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ పాల్గొని పోటీలను ప్రారంభించారని జిల్లా సాఫ్టబాల్ ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ తెలిపారు. ఈ క్రీడా భాగంలో 20 మంది బాలుర 20 మంది బాలికలను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. ఇందులో వారం రోజులపాటు శిక్షణ ఇచ్చి 16 బాలుర జట్టు 16 బాలికల జట్టు ను ఎంపిక చేస్తారాని కోచ్ రాధే శ్యామ్, అనిల్ ఎన్ఐఎస్ కోచ్ అఖిల తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఈటిలు మమత. మణిరాజ్. నాగరాజు. రాజు. రవికాంత్. మనోహర్. సీనియర్ క్రీడాకారులు గణేష్. నవీన్. మదన్. శ్రీనివాస్.లు పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయుల బృందం


తాంసిలో అయ్యప్ప పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా అయ్యప్పస్వామి పల్లకీ సేవ

తాంసి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్వామియే శరణం.. శరణం అయ్యప్ప అంటూ గ్రామం మొత్తం మార్మోగింది. బుధవారం తాంసి మండల కేంద్రంలో అయ్యప్ప భక్తులు అయ్యప్ప పల్లకి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమైన ఈ పల్లకి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగింది. సుమారు 40 మంది అయ్యప్ప స్వామి భక్తులు భక్తి గీతాలు ఆలపిస్తూ భాజా భజంత్రీలతో గ్రామంలోని పలు వీధుల గుండా అయ్యప్పను ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఉదయం నుంచి వాకిళ్ల వలికి అయ్యప్ప స్వామి పల్లకికి మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో గురు స్వాములు ఎల్మ గంగారెడ్డి, సతీష్, నరేష్ రెడ్డి, కిషన్, కృష్ణ వసంత్, పోచారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

తలమడుగు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచిగా వార్డు మెంబర్గా పోటీ చేస్తున్న అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల అధికారులు జారీ చేసిన నియమ నిబంధనలు పాటించాలని కోరారు. అదేవిధంగా స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రోజు వారి ఖర్చుల వివరాలు, ప్రచార ఖర్చులు వాహనాల ఖర్చులు, ఎన్నికల అధికారులకు తెలపాలన్నారు అదేవిధంగా ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా నిబంధనలు అధిక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో 29 గ్రామపంచాయతీలో గాను 66 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. అదేవిధంగా 248 వాడు మెంబర్ల గాను 325 మంది పోటీలో ఉన్నారని తెలిపారు. ఎంపీవోడీ శంకర్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నేరడిగొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలం, లఖంపూర్ గ్రామానికి చెందిన గౌసోద్దీన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం వారి ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. గౌసోద్దీన్ చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

జైనథ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే అతిప్రాచీన ఆలయాల్లో ఒకటైన జైనథ్ శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయలశంకర్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం జైనథ్, తరోడ, అనంతపూర్, దీపాయిగూడ కూర గ్రామాల్లో బీజేపీ బలపరిచి అభ్యర్థుల తరపున ప్రచారం చేపట్టారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మంచి నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లోని సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని పేర్కొన్నారు.

నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు

తలమడుగు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పదవుల కోసం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలకు నమ్మి మోసపోవద్దని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ వేణుగోపాల చారి అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని ఉమ్మడం, సుంకిడి, సాయి లింగి, కుచాలాపూర్. తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ చారి మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామకోటి ఉత్సవాలు

నేరడిగొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో శ్రీరామకోటి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. బుధవారం శివానంద భారతి స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గత ఆదివారం ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజలు, హోమాలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీరామ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగుతోంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయ కమిటీ సభ్యుడు ఏలేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

పండుగ సాయన్న ముదిరాజ్‌కు నివాళి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : సమాజ అభ్యున్నతి కోసం పాటు పడిన మహనీయుల ఆశయాలను నెరవేర్చే దిశగా కృషి చేయాలని పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దారవేని రాము అన్నారు. పండుగ సాయన్న ముదిరాజ్ 90వ వర్ధంతిని పురస్కరించుకుని సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన పోరాటాలు, త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

'తొలివిడత'కు సర్వంసిద్ధం

(5వ పేజీ తరువాయి...)

ఎన్నికలు నిర్వహించేందుకు 1,408 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మధ్యాహ్నం నుంచి ఫలితాలు

ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా, మధ్యాహ్నం 1గంట వరకు పూర్తికానుంది. భోజనం విరామం అనంతరం మధ్యాహ్నం 2 నుంచి ఓట్ల లెక్కింపు చేపడుతారు. తొలుత వార్డుల వారీగా లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు. చివరగా సర్పంచ్ అభ్యర్థుల ఫలితాలను వెల్లడిస్తారు. దీంతో సర్పంచ్, వార్డు పదవుల కోసం పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో అప్పుడే టెన్షన్ మొదలైంది. పల్లెల్లో ఇంటింటికీ తిరిగి ముమ్మర ప్రచారం చేసిన అభ్యర్థులు రాబోయే ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గ్రామస్థులు ఎవరిని అందలం ఎక్కిస్తారో? ఎవరిని ఓడిస్తారోనని ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం 5గంటల వరకు తొలివిడత ఎన్నికల ఘట్టం పూర్తికానుంది.

మారుమూల గ్రామాలపై ప్రత్యేక నిఘా

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మారుమూల గ్రామాలపై పోలీసులు ప్రత్యేక నిఘా సారిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోపక్క ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తుంది. ఇప్పటికే ఎన్నికల నియమావళి పై గ్రామస్థులకు అవగాహన కల్పించగా.. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకూడదని సూచించారు. నార్నూర్ మండలంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

భవన నిర్మాణ కార్మికులపై.. మృత్యుపాశం

(5వ పేజీ తరువాయి....)

రిమ్స్ మార్చురీకి తరలించారు. గాయపడ్డ యోగేష్ కు ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. కాయకష్టం చేస్తూ ఇంటికి చేదోడువాదోడుగా నిలుస్తున్న వారు ప్రమాద ఘటనలో మృత్యువాత పడడంతో బాధిత కుటుంబాల్లో విషాదం అలుముకుంది. కాగా రిమ్స్‌లోని మార్చురీలో మృతదేహాలను ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే, మాజీమంత్రి జోగురామన్న కుటుంబ సభ్యులకు ధైర్యం తెలిపారు. మృతులు బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

● టైర్ పేలి అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జండాపూర్ గ్రామం వద్ద బస్సు టైర్ పేలడంతో అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లినట ఎస్సై విష్ణువర్ధన్ తెలపడం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం (టీఎస్ 01 యూసీ 6744) అనే నెంబర్ గల బస్సు అదిలాబాదు నుంచి కరంజి వెళ్తుండగా సాయంత్రం 6 గంటల సమయంలో మార్గమధ్యంలో జమదాపూర్ వద్ద బస్సు టైర్ పేలడంతో అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లడం జరిగింది. ఈ క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వారందరూ క్షేమంగానే ఉన్నారని తెలిపారు.


టైర్ పేలడంతో ఒకపక్కకు ఒరిగిన బస్సు

నవోదయ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13 జరగనున్న నవోదయ ఎంట్రన్స్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మూడారపు పరమేశ్వర్ అన్నారు. బుధవారం నిర్మల్ డీఆర్సీలో జరిగిన చీఫ్ సూపరింటెండెంట్ల పునఃశ్చరణ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... జవహర్ నవోదయ విద్యాలయ పరీక్షలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అనుమానాలకు తావివ్వకుండా నిర్వహించాలని సూచించారు. ప్రతీ ప్రొఫార్మాను ఖచ్చితమైన సమాచారంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ రూమ్‌కు 24 మంది విద్యార్థులను కేటాయించాలని పేర్కొన్నారు. ఈ పరీక్ష ఉదయం 11:30 నుండి పగలు 1:30 వరకు జరుగునని ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించే ప్రసక్తి లేదని తెలియజేశారు. ఈ పరీక్ష నిర్వహణ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, మెడికల్ సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని వెల్లడించారు. కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్. కృష్ణ మాట్లాడుతూ... నవోదయ పరీక్షను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. అనంతరం నవోదయ పరీక్ష నిర్వహణపై పవర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ పునఃశ్చరణ తరగతులకు జిల్లాలోని నవోదయ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు హాజరయ్యారు.

విద్యార్థులకు శిక్షణా తరగతులు

సోన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండల కేంద్రంలోని అభ్యాస గురుకులం పాఠశాలలో రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తల్లిదండ్రు లు, గురువుల పట్ల ఎలాంటి భక్తి భావాలని కలిగి ఉండాలని, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఎలా ప్రయత్నించాలనే విషయాల గురించి లీడ్ ఇండియా ఫౌండేషన్ ట్రైనర్స్ మొదటి రోజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నిర్మల్ టౌన్ ప్రెసిడెంట్ చంద్ర గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ పుల్లూరి ప్రదీప్ కుమార్, లీడ్ ఇండియా ట్రైనర్స్ మల్లయ్య, విజయ్, చిరంజీవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సర్పంచ్ అభ్యర్థులతో సమావేశం

» నిర్మల్ జిల్లా అబ్జర్వేషన్ అధికారి మనోహర్

భైంసా రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నామినేషన్ వేసిన సర్పంచ్ అభ్యర్థులతో జిల్లా అబ్జర్వేషన్ అధికారి మనోహర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విధి విధానాల ప్రకా రం ప్రతీ గ్రామంలో జనాభా ఆధారంగా ప్రతి ఒక్కరూ పరిమితికి మంచి డబ్బులు ఖర్చు చేయాలని తెలిపారు. వార్డు మెంబర్, సర్పంచ్ మెంబర్లు ప్రచార సమయంలో సమయపాలన పాటిస్తూ ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రదీప్, ఏఈవో జగదీష్, ఎంపీడీవో నీరజ్ కుమార్, సర్పంచ్ అభ్యర్థులు, వార్డు మెంబర్ అభ్యర్థులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అబ్జర్వేషన్ అధికారి మనోహర్

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

» కౌంటింగ్ సందర్భంగా వీడియో రికార్డింగ్

లక్ష్మణచాంద, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం అన్నారు. ఆయా గ్రామ పంచాయతీలలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేస్తున్న ప్రత్యేక సమావేశ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి దిశానిర్దేశం చేశారు. మండలం మొత్తం మీద 18 గ్రామ పంచాయతీలుండగా 60 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తుండగా, 297 మంది వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, తదితరులున్నారు.

కౌంటింగ్ సందర్భంగా వీడియో రికార్డింగ్...

గ్రామ పంచాయతీ ఓటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కౌంటింగ్ చేస్తున్నప్పుడు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశానుసారం వీడియో రికార్డింగ్ చేయాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఈ ప్రక్రియను మన జిల్లాలోనే ప్రథమంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న ఫైజాన్ అహ్మద్

కాబట్టి అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్పీ జానకి షర్మిల ఆదేశానుసారం సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సై జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పకడ్బందీ పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యంతో పోలీసులు

నిర్మల్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని బుధవారం పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాంశ గ్రామానికి చెందిన బద్దం విజయ్ నిర్మల్ పట్టణం నుండి అక్రమంగా మద్యం తరలిస్తుండగా 100.7 లీటర్లు (58 లీటర్ల బీర్లు, 48.7 లీటర్ల విస్కీ) సుమారు 68,270 రూపాయల విలువైన మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాల్లో బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

నసీరాబాద్‌లో ద్విచక్ర వాహనాలు ఢీ

» గాయపడిన వారిని నిర్మల్ ఆస్పత్రికి తరలింపు

నర్సాపూర్(జి), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నసీరాబాద్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో నిజామాబాద్‌కు చెందిన కూలీ శ్రీహరి తీవ్రంగా గాయపడగా, రాంపూర్‌కు చెందిన బైక్ నడుపుతున్న శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి స్థానికులు 108కి ఫోన్ చేయడంతో ఈఎంటీ సృజన్, పైలట్ గోపి వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను రక్షించి, మెరుగైన చికిత్స కోసం వారిని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శ్రీహరి పరిస్థితి విషమంగా ఉంది.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి

» జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల

భైంసా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ చట్టపరమైన సమస్యలతో పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీ సు అధికారులు కాలయాపనకు తావు లేకుండా సత్వర న్యా యం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మి ల ఆదేశించారు. బుధవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో గ్రీవేన్స్ డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫి ర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా ఫిర్యాదుల ను సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్ఐలకు వివరించి పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశ, నిర్దేశం చేశారు. బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. ఇదే క్రమంలో గ్రీవెన్స్ డేలో భాగంగా ఇది వరకు స్వీకరించిన ఫిర్యాదులు,వాటిలో పరిష్కరించిన, పెండింగ్‌లోనున్న వాటిపై ఆయా పోలీసు స్టేషన్ల ఎస్ఐలతో సమీక్షించారు.పెండింగ్‌లోనున్న ఫిర్యాదులను జాప్యపు విధానాలకు తావులేకుండా పరిష్కరింప చేయాలని తెలిపారు.

ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్

కుంటాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుంటాల మండలంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభ మైంది. ఇక్కడి ఓటర్లు వివిధ ఉద్యోగాల్లో ఉంటూ ఎన్నికల విధుల్లో పాల్గొనే వా రు వినియోగించుకునే పోస్టల్ బ్యాలెట్‌ను కుంటాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రారంభించారు. శుక్రవారం వరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే అన్ని రకాల ఉద్యోగులు ఈ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. బుధ వారం పలువురు ఉద్యోగులు ఈ పోస్టల్ బ్యాలెట్ లో ఓటు వేశారు.


పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న ఉద్యోగి

ఎన్నికల వెబ్ కాస్టింగ్‌ను పరిశీలించాలి

» నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత ఎన్నికలు జరగనున్న పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ తీరును నిశితంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో వెబ్ కాస్టింగ్ ప్రక్రియ అత్యంత కీలకమని అన్నారు. తప్పనిసరిగా షిఫ్టుల వారీగా పోలింగ్ సిబ్బంది, పోలింగ్ ఏర్పాట్లను, నేటి రోజున పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. వెబ్ కాస్టింగ్‌లో లోపాలు తలెత్తితే వెంటనే ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులను సంప్రదించి, వెబ్ కాస్టింగ్ పునరుద్ధరణ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణలో డీపీవో శ్రీనివాస్, ఈడీఎం నదీమ్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు ఉపాధ్యాయులకు ఓడీ కల్పించాలి

» డీటీఎఫ్ జిల్లా కమిటీ

నిర్మల్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం జరుగ నున్న గ్రామ పంచాయతీ మూడు విడతల ఎన్నికలలో పాల్గొంటున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికలు జరిగిన మరుసటి రోజు ఓడీ సౌకర్యం కల్పించాలని జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి చంద్ర నాగకాంత్, మహేంద్రచారి అ న్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించిన రోజు పోలింగ్ మెటీరియల్ అప్పజెప్పడానికి జరిగే జాప్యాన్ని దృష్టిలో ఉంచుకొని మరుసటి రోజు సెలవు ప్రకటించాలి. రెండు విడతల ఎన్నికలు నిర్వహించిన వారికి మూడో విడత మినహాయించి అసలే డ్యూటీ పడని వారికి విధులు కేటాయించాలి. ఎన్నికల విధులలో గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులు, కుటుంబ సభ్యుల్లో దీర్ఘకాలిక వ్యాధులున్న ఉద్యోగులకు, అంగవైకల్యం ఉన్న ఉద్యోగులకు, 6 నెలల్లో రిటైర్మెంట్ అయ్యే వారికి వారి వారి అప్పీల్స్‌ని గౌరవించి మినహాయింపు ఇవ్వాలని, నివాస ప్రాంతానికి రవాణా సౌకర్యం కల్పించాలని, పోలింగ్ కేంద్రాల్లో భోజన సౌకర్యాలు, కనీస వసతులు కల్పించాలని, రెమ్యూనరేషన్ వ్యత్యాసం లేకుండా పారదర్శకంగా చెల్లింపులు జరపాలన్నారు.

ఘనంగా సాయన్న 90వ వర్ధంతి


సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీఎన్జీవోస్ భవనంలో బుధవారం తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న 90 వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు తెలిపారు. ముఖ్య అతిథిగా న్యాయవాదులు గంగాధర్ ముది రాజ్, సుంకరి రాజు, రాష్ట్ర నాయకులు యాటకారి సాయన్న మాట్లాడుతూ... పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్ర మాలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాతర్ల హరీష్, సుంకరి పోతన్న ముది రాజ్, దొంతుల శేఖర్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు రామగిరి రవీందర్ మహారాజు, ప్రభాకర్, పట్టణ నాయకులు మందుల భీమేష్, భీమేష్, శ్రీని వాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆశావాదులా.. అవకాశవాదులా?

» ప్రజాసేవ పేరుకేనా ?
» అంతిమ లక్ష్యం అధికారమేనా
» ఖర్చు ఎంతైనా పర్వాలేదు కుర్చే లక్ష్యం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నువ్వు ఎంత వెతికిన దొరకని మనిషి ఈరోజు మీ ఇంటి ముందుకు వచ్చి నిలబడ్డాడు. సారు అని పిలిచినా చూడని మనిషి ఈరోజు బంధుత్వాలు కలిపి మాట్లాడుతున్నాడు పలకరిస్తే పట్టింపు లేని మనిషి ఇప్పుడు పడి పడి దండాలు పెడుతున్నాడు. ఇదంతా ప్రజాసేవకా? స్వలాభానికా? ఓ ఓటరా మేలుకో... సరైన నిర్ణయం తీసుకో. ప్రభుత్వం రెండు సంవత్సరాల తర్వాత సర్పంచ్ ఎన్నికల నగారా మోగించిన సందర్భంగా గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులు తమ ప్రచార అస్త్రాలను మెల్లిమెల్లిగా బయటికి తీస్తున్నారు కులాల పేరుతో ఒకరు, సేవ పేరుతో మరొకరు, సమానత్వం పేరుతో ఇంకొకరు, డబ్బుతో కొనాలని చూసేది మరొకరు, అందరి లక్ష్యం మాత్రం అధికారమే గ్రామంలో జరిగే పెండ్లిలకు వెళ్లి అక్షింతలు వేసిన, చావులకు పోయి పరామర్శించి సహాయం పేరున డబ్బులు ఇచ్చిన,ఆసరా పేరుతో ఆదుకుంటా మన్న, ఎత్తు లేవైనా అధికారం కోసం తప్ప మరొకటి కాదు అవసరాలు తప్ప ఆప్యాయతలు కావు.

ఎలాగైనా సరే..

ఐదుసంవత్సరాలు డబ్బులు దుండుకోవడానికి పదవులను దక్కించుకోవడానికి అభ్యర్థులు సామ, భేద, దుండోపాయాలను ఉపయోగిస్తున్నారు. ఊరిలో కొందరిని మాటలతో మభ్యపెట్టడం, డబ్బులు పోసి కొనుక్కోవడం, గ్రామాల్లో మద్యం మాంసం పంచడం వినకపోతే బెదిరించి మరి తమతోవకు తెచ్చుకోవడానికి అభ్యర్థులు శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నారు.

రాజీ రాజకీయ..

గ్రామాల్లో అభ్యర్థులు ప్రజలను తమ వైపు తిప్పుకోవడానికి రోజు విందులు, వినోదాలు ఏర్పాటు చేస్తున్నారు, తమకు అనుకూలంగా లేని మందిని కులపెద్దలతో మాట్లాడి ఒప్పించి రాజీ కుదుర్చుకుంటున్నారు.ప్రజలను మచ్చిక చేసుకోవడానికి అనేకనేక వాగ్దానాలు చేస్తున్నారు. ఈ 4రోజులు ప్రజలను తమవైపు తిప్పుకోవడానికి డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు.

ఓటరా మేలుకో..

నీ ఇంటి ముందుకొచ్చి పడిపడి దండాలు పెడుతున్నారని మోసపోకు నీ ఐదు సంవత్సరాల భవిష్యత్తు వారికి ఇస్తున్నావని మర్చిపోకు, మందుకు మనీకి అమ్ముడుపోకు, నీ కులపోడనో పైసలు ఉన్నావాడనో చూడకు. అవకాశం అవసరమే తప్ప ఆశయాలు లేని నాయకులు నీ అవసరాలకు ఆసరాగా ఉండగలరా, పదవులే పరమావధిగా బతికేవారికి, చెప్పులు విడిచినంత సేపట్లో పార్టీలు మార్చే వారికి నీ ఊరుని నీఊరి ప్రజలబాగోగులను చూడగలడా? మనీకి మత్తుకు బానిస కాకుండా ఊరికి సేవ చేసే నాయకులను గెలిపించుకోగలరా? ఐదు వందలకు అభివృద్ధిని5 సంవత్సరాల కాలాన్ని అమ్ముకుంటారా,ఈసారి ఊరినిలూటీ చేసే టోడ, ఊరి కోసం పని చేసేటోడ మనమే నిర్ణయం తీసుకోవాలి.



గ్రామపంచాయతీ కార్యాలయం

ఓటు హక్కు వినియోగించుకోండిలా..

ఇచ్చోడ, డిసెంబరు, 10 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడత గ్రామపంచాయతీల్లో గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. ఓటర్లు కింది నిబంధనలు పాటిస్తూ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

» పోలింగ్ సమయం : ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు
» అర్హులు : ఓటరు జాబితాలో పేరు నమోదై ఉన్నవారు మాత్రమే
» ఈ గుర్తింపు కార్డులు తప్పనిసరి
» ఓటరు గుర్తింపు కార్డు పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలి. అది లేని పక్షంలో ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఫోటో ఉన్న బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతా పాస్‌బుక్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల గుర్తింపు కార్డు, పెన్షన్ పొందే గుర్తింపు కార్డు, ఆర్‌జి (రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా) జారీ చేసిన స్మార్ట్ కార్డులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.
» ఒక్కో వార్డుకు ఒక్కో పోలింగు స్టేషన్ ఏర్పాటు చేస్తుండగా సర్పంచి అభ్యర్థి, వార్డు అభ్యర్థికి ఒకేసారి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.
» సర్పంచి అభ్యర్థికి గులాబిరంగు, వార్డు అభ్యర్థికి తెలుపు బ్యాలెట్ పేపర్లు ఇస్తారు.
» నచ్చిన అభ్యర్థి గుర్తుపై స్వస్తిక్ ముద్ర వేసి ఒకే బ్యాలెట్ డబ్బాలో వేయాల్సి ఉంటుంది.

ఆశీర్వదించండి ఎడ్‌బిడ్‌ను అభివృద్ధి చేస్తా

» ఎడ్‌బిడ్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి నల్లోల్ల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


నల్లోల ప్రవీణ్ కుమార్ రెడ్డి, సర్పంచ్ అభ్యర్థి, ఎడ్‌బిడ్

ముథోల్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) :ఎడ్‌బిడ్ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ అభ్యర్థి నల్లోల్ల ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎడ్‌బిడ్ గ్రామపంచాయతీలోని ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో నెలకొన్నసమస్యలను పరిష్కరించి గ్రామంలోని విద్య, వ్యవసాయం, తాగు నీరు, పచ్చదనం, పరిశుభ్రత, విద్యుత్ దీపాలు, మురికి కాలువల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం చేసి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులకు చేన్లకు వెళ్లేందుకు రహదారుల ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అంతేకాకుండా విద్య, మహిళా సాధికారతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సైతం అర్హులైన పేదలకు అందెలా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అంతే కాకుండా గ్రామంలో అర్హులైన వారికి పింఛన్లతో పాటు గ్రామంలోని ప్రధాన కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సహకరిస్తాను. గ్రామస్థులందరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమన్నారు. సర్పంచ్ కుర్చీ కోసం తన ఆరాటం కాదని ఊరు అభి వృద్ధి కోసమే తన పోరాటమన్నారు.కత్తెర గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఆశీర్వదించండి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతా

● కుభీర్ సర్పంచ్ అభ్యర్థి సమీనాఖానం ముజాహిద్‌ఖాన్


కుభీర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి సమీనాఖానం ముజాహిద్‌ఖాన్

కుభీర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామప్రజలు ఆశీర్వదించి రిమోట్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే కుభీర్ పంచాయతీని జిల్లాలోనే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్టీ నారాయణ్‌రావుపాటిల్ వర్గం బలపరిచిన అభ్యర్థి సమీనాఖానం ముజాహిద్‌ఖాన్ అన్నారు. ముఖ్యంగా గ్రామంలోని నయాబాదీ కాలనీలో ఇళ్లపై నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్ తొలగింపు, ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు, ప్రసవాలు, జరిగేలా స్థాయిని పెంచి 50పడకల ఆసుపత్రిగా మారుస్తానని, వర్షాకాలం శ్రీ విఠలేశ్వరస్వామి ఆలయంలోకి వరద నీరు చేరకుండా అందరితో చర్చించి ప్రత్యేక ప్రణాళికలతో చర్యలు చేపడతానని, రైతు సోదరులు ఎదుర్కొంటున్న వ్యవసాయ అంతర్గత రహదారులను సమస్య పరిష్కరించి రైతులకు అండగా నిలుస్తానని, శ్మశాన వాటిక అభివృద్ధి చేసి కావాల్సిన వసతులు కల్పిస్తాను. యువత కోసం మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని, గ్రామంలో మైనార్టీ సోదరుల కోసం షాదీఖానా నిర్మాణం చేపడతాని, కాంగ్రెస్ పార్టీ, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా కృషి చేస్తానని అంటూ తమ ఎజెండాను ఓటర్లకు వివరిస్తూ బుధవారం తమ ప్రధాన అనుచరులు బంకబాబు, బషీర్‌పటేల్, సందీప్ దుగ్గే, అబ్దుల్ వాహిద్, కందూర్ రాందాస్, ఖలీల్‌తో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

స్థానిక ఎన్నికల్లో మైండ్‌గేమ్

బోథ్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ గ్రామాలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు మైండ్‌గేమ్ ఆడుతున్నారు. ఒకరికంటే ఒకరు పై ఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని చిత్తు చేయాలని చూస్తున్నారు. సోనాల మండల కేంద్రంలో ఓ అభ్యర్థి తనదైన శైలిలో మైండ్ గేమ్ ఆడుతున్నారు.మీవాడు మా అభ్యర్థికి సరెండర్ అయ్యాడు పోటీ నామా మాత్రమే అంటు ఆయన అనుచరులకు తెలపడంతో సదరు పోటీ చేస్తున్న అభ్యర్థి అనుచరులు పోటీదారులకు ఫోన్లు చేస్తూ మీరు విత్‌డ్రా చేసుకున్నారా ఎదుటి వ్యక్తికి మద్ధతునిస్తున్నారట అయితే మా సంగతి ఏంటి అంటూ ఫోన్లు చేస్తున్నారు. అయితే ఇదంతా ఎదుటి పార్టీ వారు మనల్ని గెలవనీయకుండా ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారని ఆయన అనుచరులకు వివరణ ఇస్తున్నారు.

ఏకగ్రీవాల వెనుక వేలం వెర్రి

» ఆరున్నర లక్షలు చెల్లించి సర్పంచ్ పదవిని కొనుక్కున్నారు

బోథ్,డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాలు ఏకగ్రీవ సర్పంచుల ఎన్నుకున్నాయి. అయితే ఏకగ్రీవాల వెనుక పెద్ద కథనే నడిచిందని విశ్వసనీయంగా తెలిసింది. మండలంలోని ఏజెన్సీ గ్రామానికి చెందిన వారు పదవికి వేలం వేసినట్లు సమాచారం. అయితే పదవిని చేజిక్కించుకునేందుకు గతంలో పదవిని అనుభవించిన వ్యక్తి ఆరున్నర లక్షలు చెల్లించేందుకు ముందుకు వచ్చి సర్పంచ్ కూర్చిని కైవసం చేసుకున్నారు. దీంతో గ్రామంలో వార్డులతో పాటు ఉపసర్పంచ్ ఎన్నిక సైతం అయింది. ఏది ఏమైనా సర్పంచ్ పదవి వేలం అంతర్గతంగా కొనసాగిందని అంటున్నారు.

ఎన్‌టీఆర్ నగర్ ప్రజల డంపింగ్‌యార్డు సమస్య పరిష్కరిస్తా

» ఉట్నూర్ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి మేస్రం భాగ్యలక్ష్మీ


మేస్రం భాగ్యలక్ష్మి, ఉట్నూర్ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి

ఉట్నూర్,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎన్టీఆర్‌నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న డంపింగ్‌యార్డు సమస్యను సమూలంగా పరిష్కరించడానికి డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలిస్తానని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేస్రంభాగ్యలక్ష్మి తెలిపారు. ఉట్నూర్ పంచాయతీ పరిధిలో గిరిజన నేతరుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి వివాదం కలగకుండా ప్రజలకు పూర్తి భద్రత కలిగిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మొదటి దశలో రాని వారికి రెండో దశలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో ఇండ్లు మంజూరు చేయిస్తానన్నారు. ఉట్నూర్ పట్టణంలో ఉన్న అన్ని క్రీడా మైదానాలను పరిశీలించి అవసరమైన చోట పిల్లల పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. తాను గెలిస్తే గిరిజనేతరులకు ఇబ్బంది ఉంటుందని ప్రత్యర్థులు చేస్తున్న మాటలను ఎవరు నమ్మొద్దని గిరిజనేతరుల ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తాను. తనను ఆశీర్వదించి ఓటర్లు తన బెండకాయ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని భాగ్యలక్ష్మి కోరారు.

క్రైం సమాచారం

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా షాపు దగ్ధం


అనంతపేట్‌లో కిరాణా షాపులో కాలిపోయిన సామగ్రి

మామడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపేట్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ కిరాణా షాపు బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... షాపును మూసి ఇంటికి భోజనం చేయడానికి వెళ్లానని, అంతలోనే కిరాణా షాపు నుంచి పొగలు రావడంతో చుట్టు పక్కల వారు గమనించి, విద్యుత్ వైర్‌ను కట్ చేసి లోపలికి వెళ్లి మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో రూ. 60 వేల విలువ గల కిరాణా సరుకులు, వస్తువులు కాలిపోయినట్లు శ్రీనివాస్ వాపోయాడు. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు

నార్నూర్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు నార్నూర్ సీఐ అంజమ్మ తెలిపారు. మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో గత రాత్రి వేళలో కొనసాగుతుండగా నిబంధనలకు విరుద్ధంగా తన ఇంటి ఆవరణలో 50 మందితో కలిసి సర్పంచ్ అభ్యర్థి మధుకర్ ప్రచారం నిర్వహిస్తుండగా విశ్వసనీయ సమాచార మేరకు ఎఫ్ఎస్‌టీ టీం తనిఖీ చేయడం జరిగిందని, ఎఫ్ఎస్‌టీ టీం ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేయకూడదని, డబ్బులు, మద్యం, బహుమతులు లాంటివి అందించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.

ఉద్యోగాల పేరిట టోకరా.. నిందితురాలి అరెస్టు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనంత ఈ-సొల్యూషన్‌లో ఉద్యోగాలంటూ నిరుద్యోగులను మోసం చేసిన కేసులో ఆదిలాబాద్ టూ టౌన్ పోలీసులు మరో నిందితురాలు మంజులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాదాపు 50 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి వారి నుంచి రూ.50లక్షలకు పైగా నిందితులు వసూలు చేశారు. ఆదిలాబాద్ పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన బాధితుడు మేస్రం ఉమేష్ జులైలో పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లోనే బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కోవవిఠల్‌ను నిందితునిగా పోలీసులు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. తాజాగా జనగాం జిల్లాకు చెందిన మరో నిందితురాలు మంజులను బుధవారం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో మరో ప్రధాన నిందితుడు మధుకిరణ్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఉద్యోగాలపై ఆశతో డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఆయన సూచించారు. ఉద్యోగాల వంకతో మోస పోయిన వా రుంటే ఫిర్యాదు చేయాలని సూచించారు.

అక్రమ మద్యం పట్టివేత

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణం నుంచి అక్రమ మద్యం గ్రామాలకు తరలిస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేయడంతోపాటు వారి వద్ద నుంచి రూ. 59,600 విలువగల 112.77లీటర్ మద్యం, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.జిల్లాఎస్పీ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ పట్టణంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో బంగారిగూడకు చెందిన నబ్లే అమర్, రణదీవ్ నగర్‌కు చెందిన కాంబ్లే సోనూ, తిర్పెల్లికు చెందిన కరోరాశుభమ్, పల్లికొండ శంకర్, బంగారిగూడకు చెందిన వైరగాడే తిరుపతి, విద్యానగర్‌కు చెందిన గంద్రత్ పృథ్వీ, రాంపూర్ గ్రామానికి చెందిన దొంకురి రాజుపై ఎక్సైజ్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పోలీస్ స్టేషన్‌లో హంగామా, యువకుడి రిమాండ్

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అకారణంగా హంగామా, న్యూసెన్స్ చేసిన యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. విద్యానగర్‌కు చెందిన ఎల్టీ సన్నిరెడ్డి బయట గొడవ పెట్టుకొని స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి గత రాత్రి వచ్చాడని సీఐ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో మద్యం మత్తులో న్యూసెన్స్ చేయడంతో కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పోలీసు జాగిలానికి అంత్యక్రియలు


జాగిలం మృతదేహానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దొంగలను గుర్తించడంలో, నేరస్తులను పట్టుకోవడంలో పోలీసులతో కలిసి సేవలందించిన 2012 బ్యాచ్‌కు చెందిన పోలీసు జాగిలం రూని తనువు చాలించింది. జాగిలానికి స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అంత్యక్రియలు నిర్వహించగా... ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని జాగిలానికి సెల్యూట్ చేసి రూని సేవలను గుర్తు చేసుకున్నారు. రూని సర్వీస్‌లో దాదాపు 250 కేసుల్లో పాల్గొని 20 మంది నేరస్తులను పట్టుకోవడంలో తనవంతు పాత్ర పోషించిందని ఎస్పీ తెలిపారు. హత్య కేసులు, దొంగతనాల కేసుల్లో వాసనను పసిగట్టి, నేరస్తులను పట్టుకోవడంలో దిట్టగా పేరొందిందన్నారు. తనిఖీల సమయంలోను విశేషమైన సేవలు అందించిందని కొనియాడారు. పది సంవత్సరాల పాటు పోలీసు వ్యవస్థకు, ప్రజలకు విశేష సేవలందించి 2021లో పదవి విరమణ పొందిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్యూటీ ఆఫీసర్ దత్తారం, రూని జాగిలం హ్యాండ్లర్, పి.గంగన్న, ఎస్.తిరుమలేశ్, పి.దినేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవ ఎన్నికలతోనే గ్రామాల అభివృద్ధి: బోథ్ ఎమ్మెల్యే


ఏకగ్రీవ సర్పచ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ,డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవమైతే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ మండలంలోని కుంటాల (కె) గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా, నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.ఈసందర్భంగా ఎన్నికైన సర్పంచ్, రాథోడ్ సావిత్రి ఉపసర్పంచ్ శ్రీనివాస్ సభ్యులను ఆయన శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కుంటాల(కె) గ్రామ ప్రజలు ఐకమత్యంతో ఏకగ్రీవఎన్నిక జరపుకోవడం ఆదర్శనీయమని ఆయన కొనియాడారు.

ఓటర్లకు డబ్బు పంచుతున్న వ్యక్తిపై కేసు

● రూ.10 వేలు స్వాధీనం

నార్నూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల-2025 నేపథ్యంలో ఓటర్లకు డబ్బులు పంచుతూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వ్యక్తిపై నార్నూర్ పోలీస్ స్టేషన్‌లో 134/2025తో పంచాయతీ రాజ్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు నార్నూర్ సీఐ అంజమ్మ తెలిపారు. ఈనెల 10న అర్ధరాత్రి రాథోడ్ సోరాజీ, డిప్యూటీ తహసీల్దార్, ఐటీడీఏ ఉట్నూర్ ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి, నార్నూర్ ఎఫ్ఎస్‌టీ విధుల్లో ఉన్న సమయంలో, నార్నూర్ గ్రామంలోని ముస్లిం వాడ పరిసరాల్లో ఓటర్లకు డబ్బులు పంచుతున్న వ్యక్తి ఉన్నాడనే విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. తక్షణమే ఆయన తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని, అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని చెక్ చేయగా, అతడి వద్ద రూ.10 వేలు లభించాయని, విచారణలో అతను విజయనగర్ కాలనీకు చెందిన ఆడె సురేష్(43)గా వెల్లడించాడు. అతను తన భార్య సర్పంచ్ గెలవడానికి ఓటర్లకు డబ్బులు పంచుతున్నట్లు అంగీకరించాడన్నారు. అతని వద్ద ఉన్న రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం స్వాధీనం చేసిన మొత్తాన్ని సురక్షితంగా సంబంధిత అధికారులకు అప్పగించారు. ఎన్నికల ప్రలోభాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రలోభాలకు గురి చేస్తున్న, ప్రజలకు డబ్బులు, మద్యం, బహుమతులు లాంటివి పంచిన చట్టరీత్యంగా నేరంగా పరిగణించి వారికి చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూలిన వంతెన పరిశీలన



కూలిన వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

నార్నూర్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని మలంగి గ్రామ పంచాయతీలోని బరిక్‌రావుగూడ దగ్గర ఆదివారం రాత్రికూలిన వంతెనపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై జిల్లా కలెక్టర్ స్పందించారు. బుధవారం సంఘటన జరిగిన స్థలానికి అధికారులను పంపి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థినులతో కలిసి విద్యార్థినుల్లా.. మహిళా పోలీసులు

» ఎస్పీ ఆదేశాల మేరకు వారానికి మూడు రోజులు విద్యార్థులతో మహిళా కానిస్టేబుళ్లు
» బాధితుల పేర్లను గోప్యం
» తాము ప్రతి రోజు ఇంటి బయట లైంగిక వేధింపులు


మాట్లాడుతున్న మహిళ కానిస్టేబుల్

బోథ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):బోథ్ సోనాల మండలాలలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న బాలికల సమస్యలను తెలుసుకునేందుకు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మహిళ పోలీసుల చేత ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వారానికి మూడు రోజులు మహిళ కానిస్టేబుళ్ల ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులతో కలిసి వారి సమస్యలను తెలుసుకుంటున్నారు.

విద్యార్థులతో విద్యార్థిగా

బోథ్, సోనాల మండలాల్లో చదువుతున్న 6,7,8,9,10 విద్యార్థులతో మహిళ కానిస్టేబుల్లు విద్యార్థులుగా మారుతున్నారు. వారితో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని మహిళ కానిస్టేబుళ్లు పేర్కొనుతుండడంతో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు తమ ఇబ్బందులను వివరిస్తున్నారు.

బాధితుల పేర్లు గోప్యం వేధించిన వారికి శిక్షలు

తాము విద్యార్థులతో కలిసి మాట్లాడితే అనేక విషయలు బయటకు వస్తున్నాయని మహిళ కానిస్టేబుల్ పేర్కొన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు అనేక రకాలుగా విద్యార్థుల చేత వేధింపులకు గురవుతున్నారని విషయం బయటకు వస్తుంది అన్నారు. తాము లైంగిక వేధింపులకు గురవుతున్నామని ప్రతిరోజు ఇంటివద్ద పాఠశాల బయట అనేక రకాలుగా వేధింపులకు గురవుతున్నామనే విషయాన్ని బాలికలు తెలుపుతున్నారు. దీంతో వేధింపులకు గురి చేసిన వారి పేర్లను నమోదు చేసుకొని వారికి పోలీసు స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇస్తున్నారు. పాఠశాల విడిచిన అనంతరం బస్టాండ్లలో విద్యార్థినులు వేధింపులకు గురవుతున్నారు అన్న విషయం అనేక చోట్ల ఉందని మహిళ కానిస్టేబుల్ పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఎస్పీ తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలను ఇస్తున్నది.

వామ్మో.. చలి..!

» ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు » రాష్ట్రంలోనే కనిష్టంగా 6.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


చలిమంటలు వేసుకుంటున్న ప్రజలు

ఆదిలాబాద్అర్బన్,డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మధ్య ఆసియా నుంచి వీచే అతి శీతల గాలుల ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గ్రామాలు వణికి పోతున్నాయి. జిల్లాలో బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు 29.3 డిగ్రీలు నమోదు కాగా కనిష్టంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రతి యేటా డిసెంబరులో జిల్లా ఉష్ణోగ్రతలు మరింత కనిష్ట స్థాయికి చేరుకుంటాయని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ యేడు కూడా గత వారం రోజులుగా శీతల గాలుల ప్రభావంతో చలితీవ్రత పెరిగిపోయింది. ఉదయం చలి మంచుతో గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారు. డిసెంబరు మాసంలోనే పరిస్థితి ఇలా ఉంటే జనవరి మాసంలో చలి తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. సాయంత్రం 5గంటల నుంచే చల్లని ఈదురు గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంక్కుతున్నారు.మరో వైపు గ్రామీణ ప్రాంతాలలో వాగులు, చెరువుల పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలలో చలి తీవ్రత అధికంగా కనిపిస్తుంది. గ్రామాల చుట్టు దట్టమైన అడవులు ఉండడం కూడా చలి తీవ్రతకు కారణమంటున్నారు. చలి నుంచి తట్టుకునేందుకు ప్రజలు చలి మంటలు కాచుకుంటున్నారు. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో గిరిజన గ్రామాల పరిసర ప్రాంతాలు మరో జమ్ము కాశ్మీర్‌ను తలపిస్తున్నాయి. రాత్రి వేళల్లో కూలీలు, రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీలలో పని చేసే కూలీలతో పాటు రాత్రి పూట అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు పంట చేలకు వెళ్లే రైతులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. తీవ్ర చలితో కూలీలు సతమతమవుతున్నారు. పంట చేలలోని మంచేలా కింద చలి మంటలు పెట్టుకుని రైతులు అడవి పందుల నుంచి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు బీంపూర్ మండలం అర్లి(టి) గ్రామంలో నమోదవుతున్నాయి. తాజాగా అర్లి(టి)లో 6.2 డిగ్రీల అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో చలి ప్రభావం తీవ్రంగా కనిపిస్తుంది. కాగా బీంపూర్ అర్లి(టి)లో 6.2, సోనాలలో 7.6, భోరజ్, ఆదిలాబాద్‌రూరల్‌లో 7.9, తాంసిలో 8.0, మావల మండలంలో 8.2, నేరడిగొండలో 8.6,ఆదిలాబాద్అర్బన్, తలమడుగు మండలంలో 8.7, బోథ్ పొచ్చెరలో 8.8, బజార్‌హత్నూర్‌లో 8.9, జైనథ్‌లో 9.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.





ఉట్నూర్ మండలంలో పోలింగ్ విధులకు హాజరైన సిబ్బంది, బ్యాలెట్ పత్రాలు సరిచూసుకుంటున్న దృశ్యం

భవన నిర్మాణ కార్మికులపై.. మృత్యుపాశం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు.. రిమ్స్‌కు తరలింపు
- అతివేగంతో అదుపుతప్పి పల్టీ కొట్టిన కారు
- జైనథ్‌లో తర్నం మూల మలుపు వద్ద ఘటన

అయ్యో పాపం.. ఆ భవన నిర్మాణ కార్మికుల పాలిట అతివేగం రోడ్డు ప్రమాద రూపంలో మృత్యుపాశం అయ్యింది. పొట్ట కూటి కోసం జిల్లా సరిహద్దుల వరకు మేస్త్రీ పనుల నిమిత్తం వెళ్లిన వారిని విధి వక్రీకరించింది. బేల మండలంలో పనులు ముగించుకుని ఎంతో సంతోషంగా తిరుగు ప్రయాణమయ్యారు. అంతలోనే వారిని మృత్యువు కబలించింది. జైనథ్ మండలం తర్నం మూల మలుపు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జిల్లా కేంద్రానికి చెందిన ముగ్గురు అక్కడి మృతి చెందగా.. ఒకరి తీవ్ర గాయాల పాలయ్యారు.

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మేస్త్రీ పని చేస్తూ కుటుంబాలతో ఆనందంగా జీవనం సాగిస్తున్న వారికి రోడ్డు ప్రమాదం మృత్యు పాశంగా మారింది. స్నేహితులంతా కలిసి పని నిమిత్తం బేలకు వెళ్లి మంగళవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో తిరిగి వస్తున్న సమయంలో కారు బోల్తా పడి మృతి చెందారు. ఉన్నంతలోనే సంతోషంగా జీవిస్తూ... కాయకష్టం చేసుకుంటున్న వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. జైనథ్ మండలంలోని తరోడ వద్ద జరిగిన దుర్ఘటన మూడు కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ పట్టణం ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ మెయిన్(29), కీర్తి సాగర్(28), చిలుకూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ మోహినొద్దీన్(30), యోగేష్(26) బేలలో మేస్త్రీ పనులు పూర్తి చేసుకుని తిరిగి ఆదిలాబాద్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో తరోడ మూలమలుపు వద్ద కారు పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో షేక్ మెయిన్, కీర్తి సాగర్, షేక్ మోహినొద్దీన్ లు అక్కడిక్కడే మృతి చెందారు. యోగేష్‌కు తీవ్ర గాయాలు కాగా.. స్థానికుల సహాయంతో ఆయన స్నేహితులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం

(తరువాయి 6వ పేజీలో.....)



ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకుంటున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



తర్నం మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ మెయిన్, కీర్తి సాగర్, షేక్ మోహినొద్దీన్(ఫైల్)

సమస్యాత్మక ప్రాంతాల్లో వెబ్ క్యాస్టింగ్

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక ప్రాంతాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. పౌరులందరూ ఓటు హక్కు వినియోగించాలని, తమ వెంట 18 ఫొటో గుర్తింపు పత్రాల్లో ఏదైన ఒకటి వెంట తీసుకెళ్లాలన్నారు. జిల్లాలోని 21 సమస్యాత్మక ప్రాంతాల్లోని 46 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు.

మరింత తగ్గనున్న పత్తి పంట ధర

బోథ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు కొనుగోలు చేస్తున్న పత్తిలో సరైన నాణ్యత లేదంటూ సీసీఐ అధికారులు ఈనెల15 నుంచి ధర తగ్గించనున్నారు. రైతులు తమ పత్తిని ఈనెల 15లోగా మార్కెట్‌కు తీసుకువచ్చి ధర పొందేలా చూసుకోవాలని మార్కెటింగ్ అధికారులు పేర్కొంటున్నారు. పత్తి ధర రూ.8వేల పది ఉంటుందని రైతులు గమనించాలని పేర్కొంటున్నారు.

ఆహార భద్రతపై అవగాహన కల్పించాలి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ప్రత్యుషను మర్యాదపూర్వకంగా కలిశారు. హోటళ్లు, ఇతర దుకాణాల యజమానులు, వినియోగదారులతో త్వరలోనే ఆహార భద్రత గురించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని సూచించగా.. సభ్యులు సానుకూలంగా స్పందించారు. సీవోసీ అధ్యక్షుడు దినేష్ మాటోలియా, ప్రధాన కార్యదర్శి కందుల రవీందర్, కోశాధికారి మనోహర్ కుపట్, తానాజీ, శ్రీనివాస్, అమిత్ జీవాని పాల్గొన్నారు.

తొలివిడతకు సర్వం సిద్ధం

జిల్లాలో తొలివిడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభంకానుం ది. మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగనున్న పోలింగ్ కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఆయా మండలాల్లో ఎన్నికలు జరిగే పంచాయతీలకు పోలింగ్ అధికారులు, సిబ్బంది సామగ్రితో తరలివెళ్లారు. సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి పోలీసు బందోబస్తు మధ్య ఆయా పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

తొలి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల వివరాలు

మొత్తం పంచాయతీల	166
వార్డు స్థానాలు	1390
ఏకగ్రీవమైన పంచాయతీలు	32
ఏకగ్రీవమైన వార్డులు	244
మొత్తం ఓటర్లు	171668
పోలింగ్ కేంద్రాలు	1408
పోలింగ్ బాక్సులు	1164
మొత్తం రూట్స్	31
జోనల్ ఆఫీసర్స్	31
పీవోస్	1478
ఓపీఓస్	1528

జిల్లాలో 166 పంచాయతీలు, 1390 వార్డులకు ఎన్నికలు

- పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది, సామగ్రి
- ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్
- మధ్యాహ్నం రెండు తర్వాత ఫలితాలు
- సర్పంచ్, వార్డు అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

ఆదిలాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 166 పంచాయతీలు 1,390 వార్డు స్థానాలకు ఎన్నిక లు జరగనున్నాయి. మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామ పం చాయతీల పరిధిలో 32 పంచాయతీలు, 244 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. జిల్లాలో మారుమూల ప్రాంతాలతో పాటు సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. అంతేకాకుండా మరోపక్క జిల్లా ఎన్నికల అధికారులతో పాటు ఎన్నికల పరిశీలకులు, ఇతర అధికారులు ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పర్యవేక్షించనున్నారు.



వాహనాల్లో వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

166 పంచాయతీల్లో ఎన్నికలు

జిల్లాలో తొలి విడతలో 166 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ జరగనుంది. వీటి పరిధిలో 1390 వార్డులకు పోలింగ్ నిర్వహిస్తారు. ఇందులో ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,71,668 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆరు మండలాల పరిధిలో - మిగతా 6లో

వామ్మో.. చలి!

- జిల్లాలో పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోనే అత్యల్పంగా 6.2 డిగ్రీల సెల్సియస్
- దినసరి కూలీలు, రైతులకు, మున్సిపల్ కార్మికులకు తప్పని తిప్పలు

7



పట్టణ పరిసరాలను కమ్మేసిన దట్టమైన పొగమంచు

లక్ష్య సాధనకు పాటు పడాలి

- కలెక్టర్ రాజర్షి షా సూచనలు
- ఉర్దూ భవన్‌లో ఉచిత టెట్ శిక్షణ
- అభ్యర్థులకు మెటీరియల్ అందజేత



అభ్యర్థికి మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా



సిరికొండలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో మాట్లాడుతూ..

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఉర్దూ మీడియం విద్యార్థుల కోసం స్థానిక ఉర్దూ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత టెట్ శిక్షణను కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ ప్రత్యేక నిధులతో ఉర్దూ భవన్‌లో చేపట్టిన మరమ్మతుల వివరాలను డీఎండబ్ల్యూఓ సలీం వివరించారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. మైనార్టీ విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలన్న లక్ష్యంతో శిక్షణను ప్రారంభించినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. శిక్షణకు మహిళా అభ్యర్థులు సైతం పెద్దసంఖ్యలో హాజరవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగంలోనూ అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిపై సైతం దృష్టి సారిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ అత్యధిక మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఎల్‌సీ సలీమొద్దీన్, డీవైఎస్ఓ శ్రీనివాస్, డీఎండబ్ల్యూఓ కార్యాలయ సూపరిండెంట్ రహీల్ పాల్గొన్నారు.

పంపిణీ కేంద్రం పరిశీలన

సిరికొండ: స్థానిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ రాజార్షీ షా సూచించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహించే స్థానిక ఎన్నికలకు సంబంధించి చేస్తున్న ఏరాట్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. మండల కేంద్రంలో బుధవారం పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బంది నుంచి స్థానిక ఏర్పాట్ల వివరాల విషయమై అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా గురువారం మండలంలోని 11 గ్రామ పంచాయతీలలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయని వెల్లడించారు.



ఉట్నూర్ నుంచి బ్యాలెట్ బాక్స్‌లతో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



ఉట్నూర్ మండలంలో పోలింగ్ విధులకు హాజరైన పోలీసులు



సిరికొండలో ఎన్నికల సామగ్రిని తీసుకు వెళ్లడానికి సిద్ధమవుతున్న ఎన్నికల సిబ్బంది

పంచాయతీ పోలింగ్‌కు కదిలిన ఉద్యోగులు

- తొలివిడత పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సామగ్రి, సిబ్బంది
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్... పటిష్ట బందోబస్తు

ఉట్నూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని 31 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఎన్నిక కోసం పోలింగ్ సిబ్బంది ఆయా గ్రామాలకు తరలి వెళ్లారు. ఉట్నూర్ మండలంలో పంచాయతీ ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఉదయం 10గంటల నుంచి మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఎంపీడీఓ రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రానికి ఉద్యోగులు తరలివచ్చారు. మండలంలోని 10 రూట్లలో పదిమంది జోనల్ అధికారుల ఆధ్వర్యంలో 298 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. అనంతరం ఎన్నికల పోలింగ్ సామాగ్రితో పాటు బ్యాలెట్ బాక్సులు అందించి వారికి కేటాయించిన వాహనాలలో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించడంతో పోలింగ్ సిబ్బంది తరలి వెళ్లారు. బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఐటీడీఏ ఇన్‌చార్జీ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ పరిశీలించారు.

సిరికొండ: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికిఆరులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో 11 గ్రామ పంచాయితీల్లోని పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని, ఎన్నికల సామాగ్రిని కేటాయించారు. కాగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో రక్త పరీక్షలు

నేరడిగొండ, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్టికల్ బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచే ఉద్దేశంతో (కిడ్నీ పనితీరు), (కాలేయ పనితీరు) పరీక్షల నిమిత్తం రక్త నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ స్వప్న, హెల్త్ సూపర్ వైజర్ ఎ.సంతోష్, ఎంఎల్‌హెచ్‌పీ భీమరాజు, ఫార్మసిస్ట్ ఓంప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్, ఏఎన్‌ఎం సుజాత, కె.గంగారాం, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కైలాస్‌టేకిడిలో హుండీ లెక్కింపు

బోథ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న కైలాస్‌టేకిడి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు.వివిధ గ్రామాల నుంచి వచ్చిన బక్తులు ఐదు రోజుల పాటు జరిగిన జాతరలో వివిధ రూపాల్లో ఇచ్చిన హుండీ లెక్కించడం జరిగింది. అన్నదానం కోసం 331 క్వింటాళ్ల బియ్యం 13లక్షల 75వేల విలువ గల బియ్యంతో పాటు గ్రాము బంగారం 60తులాల వెండి హుండీ లెక్కించగా వచ్చిందని భక్తులు వివరించారు. అన్నదానం కోసం ఒక వంద 20 క్వింటాళ్ల బియ్యం ఖర్చుకాగా అందుకు 73,5000 రూపాయలు ప్రసాదం కింద ఖర్చయ్యాయని పేర్కొన్నారు. ఏది ఏమైనా ఈ సారి భక్తులు భారీగానే చందాలు సమర్పించడం జరిగిందని ఆలయ కమిటీ వారు పేర్కొంటున్నారు.




ఆలయ ఆవరణలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

- ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడి
- 936 సిబ్బందితో మొదటి విడత ఎన్నికలకు బందోబస్తు
- జిల్లాలో 599 మంది బైండోవర్
- 20 ఆయుధాల సేఫ్ డిపాజిట్

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలకు జిల్లా పోలీసు శాఖ పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మొదటి విడతలో భాగంగా 6 మండలాల్లో ఎన్నికలు జరగనుండగా అందులో 39 క్లస్టర్‌లు, 34 రూట్‌లతో, 166 గ్రామాల్లో 225 పోలింగ్ లొకేషన్‌లో ఎన్నికలు జరగనున్నాయి. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 938 మంది పోలీసు సిబ్బందితో పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఎస్పీ స్వయంగా 38 గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించి, ఓటుహక్కుపై అవగాహన కల్పించి నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం నుంచి 163 బీఎన్ఎస్ఎస్(144 సెక్షన్) అమలులో ఉంటుందని, ప్రజలు గుమిగూడి ఉండకుండా, గొడవలకు అల్లర్లకు దారి తీయకుండా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకొని ఇళ్లకు చేరుకోవాలని ఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సమస్యలు సృష్టించేటటువంటి వారిని, ఎన్నికలను గొడవలు సృష్టించే 599 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 20 మంది వద్ద ఉన్న ఆయుధాలను సేఫ్ డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. బందోబస్తులో ఫారెస్ట్, టీజీఎస్పీ, ఎసిటిపిసి సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు విడతల లో 128 క్రిటికల్ పోలింగ్ లొకేషన్స్ ఉండగా అందులో ప్రత్యేకంగా స్పెషల్ పార్టీ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎటువంటి సమాచార వ్యవస్థ లేనటువంటి 31 షాడో ఏరియాల్లో ప్రత్యేకంగా కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా వీహెచ్ఎఫ్ సెట్లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. బందోబస్తు ప్రక్రియలో పోలింగ్ స్టేషన్‌లో, క్లస్టర్లలో, రూట్ మొబైల్స్‌లో, స్ట్రైకింగ్ ఫోర్స్ స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటుచేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఉట్నూర్: జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ పోలింగ్ నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో మండల పరిషత్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యాలెట్, బ్యాలెట్ బాక్స్‌లో పంపిణీ కార్యక్రమం సందర్భంగా విధులకు హాజరవుతున్న పోలీసులను ఉద్దేశించి మాట్లాడారు.



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్నికల ఖర్చుపై అవగాహన

నేరడిగొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులతో ఎన్నికల ఖర్చుపై బుధవారం రైతు వేదికలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల వ్యయ పరిశీలకులు, నోడల్ ఆఫీసర్, తహసీల్దార్, ఎంపీడీవో హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన గరిష్ఠ వ్యయ పరిమితిని మించకూడదని స్పష్టం చేశారు. ప్రచారానికి సంబంధించిన ప్రతి రూపాయి ఖర్చును, దానికి సంబంధించిన రికార్డులను, ఓచర్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులు ప్రతిరోజూ తమ ఎన్నికల ఖర్చుల వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేసి అధికారులకు సమర్పించాలన్నారు. అభ్యర్థుల ఖర్చుల రిజిస్టర్లను ఎప్పటికప్పుడు ఎన్నికల వ్యయ పరిశీలకులు తనిఖీ చేస్తారని, తేడాలు గమనిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలు తెలపాలి

బోథ్: స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను తప్పనిసరిగా చూపించాలని ఎంపీడీవో మహేందర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికల్లో సర్పంచ్ వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్నికల ఖర్చుల వివరాలు తెలపాల్సి ఉటుందనివివరించారు. నమునా పోలింగ్ పత్రాలతో పాటు వాటి ఖర్చుల వివరాలను తెలపాల్సి ఉంటుందన్నారు.



నేరడిగొండ మాట్లాడుతున్న నోడల్ అధికారి మోహన్